# ఆశాజీవులు

పల్లెపట్నం కాని ఊళ్ళో టెలిఫోన్ ఆఫీసది.

ఎక్స్చేంజికి రాగానే జె.ఇ.గారు అందించిన కవరు చూసుకుని రాంబాబు తిక మక పడిపోయాడు.

స్టాఫంతా ఎవరి సీట్లో వాళ్ళు అప్పుడప్పుడే సర్దుకుంటున్నారు. ఆపరేటర్ కమలిని ఎప్పట్లాగే చిన్న అద్దంలో చూసుకుంటూ మూతిని సున్నాలా చుట్టి లిప్స్టిక్ వేసుకుంటోంది.

'' ఏంటోయ్ రాంబాబూ! ఆవదం తాగినట్టు మొహం పెట్టావ్?'' అడిగాడు మెకానిక్ రమణమూర్తి.

చటుక్కున అటువైపు నడిచేడు రాంబాబు.

పామును పట్టుకున్నట్టు రెండు వేళ్ళతో కవరు అంచును పట్టుకుని ''దీన్లో ఏముందో కొంచెం చదివి చెబుదురూ'' అన్నాడు.

రమణమూర్తి ముఖంలో ప్రశ్నార్థకం తాండవిస్తూండగా కవర్ని చించి లోపలి కాయితాన్ని బైటికి లాగేడు. టైపుచేయబడిన ఆ నాలుగు లైన్ల వెంట రమణమూర్తి కళ్ళు పరుగెడుతూంటే రాంబాబు గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి.

'కొంపతీసి ఈ చిన్న ఆధారం కాస్తా ఊడిపోలేదుఃకదా?'

చదవడం ముగించిన రమణమూర్తి కాయితాన్ని మడుస్తూ '' ఏం మనిషివయ్యా బాబూ! టెంత్ క్లాస్ పాసయ్యావ్, ఈ మాత్రం చదువుకోలేవూ? వెనకటికెవడో..''

''అబ్బా, అసలందులో ఏవుందో చెబ్దురూ చంపక ''

''చెప్తాను, మరి పార్టీ ఇస్తావా?''

' ఇదేదో శుభవార్తే' అనుకున్నాడు రాంబాబు. జన్మంలో శివరాత్రిలా వచ్చిన ఆ శుభవార్తని ఎంజాయ్ చెయ్యనివ్వకుండా పార్టీపేరు చెప్పి భయపెడుతున్నాడీ దుర్మార్గుడు అనుకున్నాడు లోలోపల.

'' ఏంటోయ్, పార్టీ అడిగేనని తిడుతున్నావేంటి కొంపదీసి'' తన జోక్కి తనే పగలబడి నవ్వేడు రమణమూర్తి.

''చెప్పండి సార్''

''చెప్తున్నా విను, ప్రస్తుతం నువ్వు చేస్తున్న కేజువల్ లేబర్ ఉద్యోగం నుంచి విముక్తి పొంది, హెల్పర్‌గా రూపుదాల్చబోతున్నావ్''

''నిజమా సార్'' ఆయన చేతులు పట్టుకొని ఊపేసేడు రాంబాబు.

రూపాయి ముప్పావలా కూలితో కేజువల్ లేబర్‌గా మూడువందల అరవైరోజులు పనిచేస్తే హెల్పర్‌గా పర్మనెంట్ జాబ్ వస్తుందన్నారు. వరసగా అన్నిరోజులూ పనిచేసే అవకాశం ఏ జె.యి. ఇవ్వలేదతనికి. పనే దైవం అనుకుని కష్టపడి పనిచేసేడు. పట్టువిడవని విక్రమార్కుడిలా ఖాళీదొరికి, కబురొచ్చినప్పుడల్లా పరుగెత్తుకెళ్ళి పని చేసాడు. గునపం, పారపట్టుకుంటే చాలు విశ్వరూపం ప్రదర్శించి నేలలో గోతులు తవ్వేవాడు. టెలిఫోన్ స్తంభాన్ని అమాంతం పాతేసి అలవోకగా నవ్వేవాడు. చిన్నప్పట్నుంచీ రాంబాబు తిన్నది గంజి అన్నమే అయినా, దేహదారుఢ్యం అతనికి వరంలా లభించింది.

అప్పుడో పదిరోజులూ, అప్పుడో పదిహేనురోజులూ చొప్పున మూడువందల అరవైకాదు, మూడువేల అరవైరోజులు పూర్తిచేసేసి చాన్నాళ్లైంది. అతని కూలి రూపాయిముప్పావలా క్రమంగా పెరుగుతూవచ్చి పదకొండు రూపాయల అరవైపైసలైంది.

ఇప్పుడీ హెల్పరుద్యోగానికి నెలకి అయిదువందల ఇరవై రూపాయల జీతం గవర్నమెంటువారు నిర్ణయించినది. ఎప్పుడైనా సెలవు పెట్టినా ఆరోజుకూలి కత్తిరించబడదు. రోజుకి పదకొండు రూపాయల అరవైపైసలు కాస్తా పదిహేడురూపాయల ముప్పైపైసలుగా మారబోతోంది. అతనికి టీ, సిగరెట్టులాంటి అలవాట్లు లేవుగనక ఆ చిల్లరంతా మిగులే కాకపోతే, ఇరవై ఏళ్ళకే పెళ్ళి చేసేసి, తన ముచ్చట తీర్చుకున్న ముసలాయన ధర్మమా అని ముగ్గురు పిల్లల తండ్రి అతను. ఈ మధ్యనే కొడుకుమీద తన బరువును ఇంకా మోపడం ఇష్టంలేక పరలోకానికి ప్రయాణం కట్టాడు అతని తండ్రి.

'' అప్పుడప్పుడూ టి. ఏలూ, డి. ఏలూ.. ఇంక మనవాడి పని ఝాం ఝుకారా. భుజాలు చిరిగిన చొక్కాలు వేసుకుని తిరగక్కర్లేదు. పుట్టింట్లో ఉన్న భార్యాపిల్లల్ని వెంటనే వెళ్ళి తీసుకొచ్చేసి కాపరం పెట్టేస్తాడు'' అని అందరికీ వినబడేలా ప్రకటించేసాడు రమణమూర్తి.

అందరూ అతని చుట్టూ మూగి ''కంగ్రాచ్యులేషన్స్‌య్'' అని అరిచారు.

''టీలకి ఆర్డరిచ్చెయ్యనా?'' రమణమూర్తి.

'' ఏఁవిటీ, ఉత్తటీనా? స్వీటూ, హాటుగట్రా..'' మరో సుబ్బారావు ఆశగా అడిగాడు. రాత్రి అతను ఆలస్యంగా ఇంటికెళ్ళినందుకు అలిగి అతని భార్య ఉదయం టిఫినేం చెయ్యలేదు. ఆకలి దంచేస్తోంది.

అందరికీ సమాధానంగా ఖాళీ జేబుల్ని బోర్లించేసాడు రాంబాబు.

'' అప్పుపెడదామా గురూ?'' గుసగుసలాడాడు క్లర్కు అప్పారావు.

'' ఆపని మాత్రం చెయ్యకు. అతను మూడునెల్లు ట్రెయినింగుకు వెళ్ళి రావాలి. గవర్నమెంటతనికి ట్రెయినింగ్ పీరియడ్‌లో నెలకి వందరూపాయలుమాత్రం ఇస్తుంది. అప్పుపెడితే అయిదో నెల్లోగాని నీ అప్పుతీరదు'' హెచ్చరించాడు లైన్‌మేన్ రాఘవరావు.

'' అయ్‌బాబోయ్'' తలవంచుకుని తనపనిలో మునిగిపోయాడు అప్పారావు.

అదుగో - అలా మొదలైంది రాంబాబు మహర్జాతకం.

ఇల్లు అని పిలవబడే నాలుగంకణాల పాకలోకొచ్చి ఇంట్లోసామాన్లన్నీ లెక్కపెట్టాడు. అవన్నీ అతని తల్లి తాలూకు సామాన్లు. ఒక బిందె, రెండు కంచాలు, ఒక చెంబు, గ్లాసు, నాల్గు సత్తుగిన్నెలు, వాటిని సంచిలోవేసి మూటకడుతుంటే అతనికి చాలా దిగులేసింది. అతనికి పదేళ్ళవయసులో పోయిన తల్లి చేతుల్లో మసలిన ఆ సామాన్లంటే అతనికి చాలా ఇష్టం. కాని, తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని అమ్మెయ్యాల్సిరావడంతో అతని కళ్ళల్లో నీళ్లూరుతున్నాయి.

మరో సమస్య అతని ముందునిలిచింది. పక్కా ఉద్యోగం వచ్చాక తీసుకెళ్తానని పుట్టింట్లో ఉంచిన భార్య వస్తే.. తను అప్పుడు మళ్ళీ ఈ సామాన్లన్నీ కొనగలడా? పేదింటపుట్టిన అతని భార్యకి పుట్టింటివాళ్ళు గిన్నెలూ తప్పేలాలూ ఇస్తారని అతను అనుకోపడంలేదు. అలా ఇమ్మనడం ధర్మమూ కాదు. ఇంచు మించు ఏడేళ్ళుగా తన భార్యనీ, పిల్లల్నీ సాకుతున్న మామగార్ని మరిక బాధించలేడు. ఆ పల్లెటూళ్ళో పౌరోహిత్యంతోనే బండి లాక్కొస్తున్న మామగారంటే భక్తీ గౌరవమూ అతనికి. ఇన్నాళ్ళూ ఆయన్ని బాధపెట్టాడు. ఇంకెంత? మూడునెల్లు ఇట్టే తిరిగి, నాలుగో నెలాఖర్లో జీతం అందుకుని, భార్యని కాపరానికి తీసుకొచ్చేస్తాడు.

అప్పుడావిడొచ్చి.. అయ్యగారి నట్టిల్లులా ఉన్న ఈ ఇంటిని చూసి ఏమనుకుంటుందో..?

' అప్పటి విషయం అప్పుడే చూసుకుందాంలే' అని నచ్చ చెప్పుకున్నాడు చివరికి.

చిరుగులు కన్పించకుండా కుట్టుకున్న జత బట్టలూ, ఒక తుండుగుడ్డా సంచిలో కుక్కుకుని, సామాన్లు అమ్మగా వచ్చిన డబ్బుల్తో కాకినాడ బస్సెక్కాడు రాంబాబు ట్రెయినింగుకోసం.

మొదట్రోజు ఊరంతా కాళ్ళరిగేలా తిరిగినా అతనికి అందుబాటులో రూమేదీ దొరకలేదు. రోజంతా ఏ ఎండనబడి తిరిగినా, రాత్రికి తల దాచుకుందుకు ఓ నీడ కావాలి గదా! తిరిగి తిరిగి చివరికి బుడంపేటలో అరవై రూపాయలకి ఓగది సంపాదించ గలిగేడు.

వయసొచ్చినప్పటినుంచి టెలిఫోన్ స్తంభాలకోసం గోతులు తవ్వడం, బరువులు మోసుకెళ్లడం తప్ప పట్నం బతుకుల బండారాలెరగని రాంబాబు రెండోరోజే ఆలస్యంగా రూమునుకొస్తూ పోలీసుల చేతిలో చిక్కాడు. రైడింగ్‌లో దొరికిన విటుడుగా అతని పేరు స్టేషన్ రిజిస్టర్లో నమోదైపోయింది. చావుతప్పి కన్నులొట్టపోయి బ్రతుకు జీవుడా అని బైట పడేసరికి అతని తలప్రాణం తోకకొచ్చింది. చేతిలో ఉన్న డబ్బులు కాస్తా ఊడ్చిపెట్టుకు పోయాయి.

ఆ పరిస్థితులలో అతన్ని తోటి ట్రెయినీస్ ఆదుకున్నారు. వాళ్ల పుణ్యమా అని రెండుపూటలా భోజనం చెయ్యగలిగేడు.

నెలాఖరున స్టయిఫండు వందరూపాయలు చేతికొచ్చేసరికి అతనికి అంతులేని ఆనందం కలిగింది. అంత డబ్బు ఒక్కసారిగా కళ్లజూడడం అతనికదే మొదటిసారి. కనీసం వందసార్లైనా కళ్లకద్దుకున్నాడు .వంద్నోటును కాగితంలో చుట్టి, సంచీకి అట్టడుగున దాచేసి, ఆ డబ్బుతో ఏమేం కొనవచ్చో కలలు కన్నాడు.

మర్నాడు-

రూంలో ఉన్న ట్రెయినీసంతా కలసి తలా డెబ్బై అయిదు రూపాయలు వేసుకొని బియ్యం, పప్పులూ తెస్తూ వుంటే, తలాపాతిక రూపాయలు కలిపి ఇంటద్దెకడుతూ ఉంటేను చూసాకా తన తప్పిదం తెలిసొచ్చిందతనికి. వెంటనే లేచి కాగితం విప్పి, తనవంతుగా వందరూపాయలు ఇచ్చేసాడు.

చివరి నెలలో అయిదు రూపాయలు మాత్రం తీసుకొని, తొంభై అయిదు ఇచ్చేసాడు.

ఆ అయిదు రూపాయలూ అతన్ని తిరిగి అతని ఊరికి చేర్చాయి.

★★★

మర్నాడు ఉదయాన్నే లేచిపోయాడు. భుజం మీది చిరుగును పదోసారి కుట్టి, షర్టు వేసుకున్నాడు.

ఏదో తెలియని ఆత్మవిశ్వాసంతో ఆఫీసులోకి అడుగుపెట్టాడు. చిరునవ్వుతో జె. ఇ రూంలోకి వెల్లిన అతను ముఖం మాడ్చుకుని వెంటనే తిరిగి వచ్చేసాడు.

'' ఏంవోయ్ రాంబాబు! ఎప్పుడు రాక?'' రమణమూర్తి పలకరించాడు. రాంబాబు వేగిరం అటునడిచాడు.

సార్, నేనీ జాబ్‌లో జాయినవ్వాలంటే ఆరువేలు డిపాజిట్టు కట్టాలని ఎవ్వరూ ఎందుకు ముందుగా చెప్పలేదు? ''నిష్ఠూరంగా అన్నాడు.

'' ఇది బావుంది, నీకు తెలుసనుకున్నాం. ఏదో, ఇంగ్లీషులో వచ్చిన ఆర్డరు చద వడం రాదంటే సహజం కాని, ఇలా జాబ్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ తెలియవనుకోలేదు''

''నిజంగా తెలీదుసార్, నన్నునమ్మండి''

'' అయితే, ఇప్పుడేం చెయ్యమంటావ్?''

'' మూర్తి సార్, ఇవిచేతులు కావు కాళ్ళనుకోండి.నాకీ సహాయం చేసిపెట్టి నా బతుకు నిలబెట్టండి.'' రమణమూర్తి చేతుల్ని పట్టుకుంటూ అన్నాడు రాంబాబు.

''పోనీ ఓపని చెయ్యి. ఇప్పుడు అర్జెంటుగా ఎల్. ఐ. సీ.పాలసీ తీసుకో అది చాలు నీకు సెక్యూరిటీ చూపించడానికి''

రమణమూర్తి ప్రైవేటుగా ఎల్లైసీ ఏజెంటు.

' ఆయనే ఉంటే మంగలెందుకు?' అని తండ్రి తరచుగా వాడే సామెత గుర్తుకొచ్చింది.కాని, పైకనలేదు.

''అదీ జరగేపని కాదంటావ్, ఇంకెలాగయ్యానీతో?''

''పోనీ ఓ పని చెయ్‌కూడదూ'' అన్నాడు సుబ్బారావు.

కీ ఇచ్చిన బొమ్మలా సుబ్బారావు వైపు తిరిగేడు రాంబాబు.

''అడుగూడిపోయిన సత్తుగిన్నేలుందా?''

'' ఎందుకండీ?'' అయోమయంగా అడిగాడు.

'' ఎందుకేటయ్యా, అడుక్కుతిండానికి''

''సుబ్బారావు గారూ!''

రాంబాబు అరిచిన అరుపుకి ఆపరిసరాలు దద్దరిల్లిపోయాయి. ఫోన్లో ఎవరితోనో ఎడతెగకుండా మాట్లాడుతున్న కమలిని చేతిలోంచి ఫోను జారిపోయింది. అవిడ కాటుక కనురెప్పలు భయంతో రెపరెపాకొట్టుకున్నాయి.

ఆ ఆఫీసులో అందరికీ ఆగొంతు కొత్తది. చేతులు కట్టుకుని మంద్రస్వరంలో మాట్లాడే రాంబాబు గొంతుమాత్రమే తెలుసు అందరికీ.

ఇప్పుడతను అరిచిన అరుపు అరుపులా లేదు. గర్జనలా ఉంది. అగ్ని గోళాల్లా మండుతున్న రాంబాబు కళ్ళనీ, బిగుసుకున్న పిడికిళ్లనీ చూసి వెనక్కి తగ్గాడు సుబ్బారావు.

పళ్ళబిగువున తనను తను కంట్రోలు చేసుకుని బైటికి నడిచాడు రాంబాబు. వరండాలో నీళ్లకుండ దగ్గర నిలబడి ఆరు గ్లాసుల నీళ్లు తాగేడు. కొన్ని నీళ్లు గుండెల మీద ఒలికీ, కొన్ని లోపలికి పోయి అతన్ని కొంత చల్లబరిచాయి. అక్కడే స్టూలుమీద చతికిల బడి ఆలోచించడం మొదలుపెట్టేడు కర్తవ్యమేంవిటని.గడువులోపల డిపాజిట్టు కట్టకపోతే ఈ అవకాశం కాస్తా చెయి జారి పోవడం ఖాయం వర్దనుకున్నా వచ్చి చెవిలో హోరబడుతోంది లోపలి సంభాషణ.

'' అవును..నాకు తెలీకడుగుతాను గురూ గారూ! ఇదేవన్నా బేంకు ఉద్యోగవా పోడా డిపాజిట్టు కట్టించుకోడానికి? ఛ ఛ పాపం చూడండి, రాంబాబు లాంటి వాళ్లకు ఎంతకష్టమో సానుభూతిగా అన్నాడు అప్పారావు.

''బాబూ! అవన్నీ గవర్నమెంటురూల్సు. గవర్నమెంటు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తోందని ఋజువుచేసుకోవడానికి సాక్ష్యాలు. ఈ టెలిఫోన్ సామాన్లు ఉత్తరోత్తరా ఎప్పుడైనా అమ్మేసుకుంటే ఈ డిపాజిట్టులోంచి కట్ చేస్తారు'' చెప్పేడు రాఘవరావు.

''డిపాజిట్టు కన్నా ఎక్కువ విలువైనవి అమ్మేసుకుంటేనో?''

'' ఏఁవిటీ, ఈ పింగాణీ చిప్పలూ, ఈ పనికిరాని బోల్టులూనా?''నిరసనగా అన్నాడు కృష్ణ, అతనింకా కొత్తవాడు.

'' అన్నన్నా, అలా తీసిపారేయకు. రూల్సంటే రూల్సేమరి.''

'' ఇంతకీ..రాంబాబు ఏం రెచ్చిపోయేడండీ బాబూ!'' సుబ్బారావు.

'' ఇలాంటి వాళ్లు రేప్పొద్దున్న టెర్రరిస్టులుగా మారిపోయినా మారిపోతారు. కావాలంటే ఇది చూడండి.''పేపరు విప్పబోయాడు రమణమూర్తి. అతనికి పేపర్లో వార్తలన్నిటికన్నా పంజాబ్‌లో టెర్రరిజమ్ గురించిన వార్తలంటే ఇష్టం. ఆఫీసులో ఎప్పుడూ అందర్నీ చుట్టూ చేర్చుకుని ఆ వార్తలు చదువుతూ, వాటికి చిలవలూ పలవలూ కల్పించి వివరిస్తుంటాడు.

''అది సరేనండి, మనం అంతాకలిసి రాంబాబుకి ఏదైనా సాయం చెయ్యలేమంటారా?'' అడిగాడు కృష్ణ.

''బాబూ! ఆ మాటకొస్తే మనమంతా ఆ రాంబాబుకన్నా ఏఁవీ మెరుగ్గాలేం.కాకపోతే ఇస్త్రీగుడ్డలేసుకుని నీట్‌గా కన్పిస్తూ లోకాన్ని మభ్యపెట్టేస్తున్నాం. ఏ నెలజీతం ఆనెల ఫస్ట్ తారీఖునే అప్పులవాళ్ళందరికీ పంచెయ్యడం, మళ్లీ ఫస్టెప్పుడొస్తుందా అని ఎదురు చూడ్డం, బ్రహ్మచారివి కాబట్టి ఏఁవైనా దాచేవేమో నువ్వే ఆ సాయమేదో చెయ్యి.''

కృష్ణ మరిమాట్లాడలేదు.

'' ఇంకోసంగతి, చిన్నదో చిటుకుదో తలదాచుకునేందుకు సొంతగూడు అతనికొక్కడికే ఉందీ ఊళ్లో.నెలనెలా జీతంలో మూడోవంతు అద్దె కింద జమకడుతూంటే ప్రాణం ఒకటే కొట్టుకుంటుందినాకు. ఇప్పటి ఈ మండిపోతున్న రేట్లలో మనలాంటి వాళ్ళు దాచేదేఁవుంటుంది?''

చెవిలో దూరుతున్న సంభాషణను నిర్లిప్తంగా వింటూ ఉన్న రాంబాబుకు రమణమూర్తి అన్నమాటల్తో తలలో ఏదోమెరుపు మెరిసినట్లయింది. చివాలున లేచి పరుగెత్తినట్టే బైటికి వెళ్ళిపోతున్న రాంబాబుని వరండాలో స్తంభానికానుకొని బీడీ కాల్చుకుంటూ తన్మయత్వంలో మునిగిపోయిన అటెండరు గంగరాజు ఆశ్చర్యంగా చూసేడు.

రాంబాబు గుడిసె పక్కవేడలో ఉంటున్న షావుకారు సత్తిరాజు వేడపక్క దిష్టిబొమ్మలా ఉన్న గుడిసెను కొనేసి అక్కడి వరకూ తన కాంపౌండువాల్‌ను పెంచెయ్యాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాడు.

ఆ తరుణం ఇప్పుడొచ్చింది.

అవసరం రాంబాబుది కాబట్టి సరిగ్గా ఆరువేలకి ఒక్కపైసాకూడా ఎక్కువివ్వలేదు సత్తిరాజు.

ఆరువేలూ కట్టేసి, అర్జెంటుగా ఉద్యోగంలో జాయినైపోయాడు రాంబాబు.

ఊరంతా తిరిగి తిరిగి నూట ఏభైరూపాయలకి గదిన్నర అద్దె ఇల్లు సంపాదించి భార్యనీ, పిల్లల్నీ తీసుకొచ్చి సొంతకాపురం పెట్టేడు. దాంతోబాటు పచారీకొట్లో, బియ్యం కొట్లో అప్పుకూడా పెట్టేడు. పుట్టింట్లో ఉన్నప్పుడు రాంబాబు అప్పుడప్పుడు ఇచ్చిన పదీ పరకా దాచి ఉంచింది మహాలక్ష్మి. ఆ డబ్బుల్తో మొదటినెల జీతం అందేవరకు ఎలాగో గడిపేసారు.

★★★

ఆరోజు ఫస్టు తారీఖు.

జీతం అందుకున్న రాంబాబుకి చాలా గర్వంగా ఉంది. గాలిలో తేలిపోతున్నట్లుంది. నరాలన్నీ తీగలుగా మారి సంగీత స్వరాలను ఆలపిస్తున్నట్టుంది. జేబు ఎంతో బరువుగా అన్పిస్తోంది.

మాటలేంవిటి? అయిదు వందల ఇరవైరూపాయలు!

ఈ డబ్బంతా ఒక్కసారిగా భార్య చేతిలో పోస్తే.. చాలా సంతోషిస్తుంది. తనలాగే మహాలక్ష్మికూడా ఇంతడబ్బును ఒక్కసారిగా చూసుండదు.

పాపం, మహాలక్ష్మికి ఒక చీరకొనిపెట్టాలి. ఆవిడకున్న మూడు చీరలూ జీర్ణస్థితిలో ఉన్నాయ్, పిల్లలకి కూడా కొనాలి. ఆ మాటికొస్తే తనకి మాత్రం. ఈ భుజాలు చిరిగిన చొక్కాలు తొడుక్కుని ఆఫీసుకి వెళ్లడం సిగ్గుగా ఉంది.

అతని కలలింకా పూర్తికాకుండానే ఇల్లొచ్చేసింది.

అప్పుడే మొహం కడుక్కుని బొట్టుపెట్టుకున్నట్టుంది, మహాలక్ష్మి పాత చీర కట్టుకున్నా, నలిగిన కాగితం లోని పాల ముత్యంలా శుభ్రంగా ఉంది. పెద్దపిల్లలిద్దర్నీ కూర్చోబెట్టుకుని అక్షరాలు దిద్దిస్తోంది. చంటిదాన్ని ఒళ్లోవేసుకుని నిద్రపుచ్చుతోంది.

రాంబాబును చూసి, పాపాయిని పడుకోబెట్టి, నవ్వుతూ ఎదు రొచ్చింది. జేబులోని డబ్బు తీసి భార్య చేతిలో పెట్టి బరువు దించుకున్నట్టు ఫీలయ్యాడు రాంబాబు.

''నీకు నచ్చిన చీరొకటి కొనుక్కో'' అని కూడా అన్నాడు.

మహాలక్ష్మినవ్వింది. వేరుగా కాపరం పెట్టకపోయినా, ఆ అమ్మాయికి అప్పటికే ఇల్లుచక్కబెట్టుకోవడం క్షుణ్ణంగా తెలుసు.

నూటయాభైరూపాయలు భర్తచేతికిచ్చి ఇంటివాళ్లకి అద్దె ఇచ్చేసి రమ్మంది. మరో నూటయాభై రూపాయలు బియ్యంకొట్లో ఇచ్చేసి, మళ్లీ అప్పుతెప్పించింది.

వంద భర్త చేతికిచ్చి ఒక జత బట్టలు తెచ్చుకోమంది.

చివరికి పచారీ కొట్లోని సరుకుల ధరలు గుర్తుకొచ్చి ఆమెగుండె గుభేలుమంది. చేతిలో మిగిలిన నూట ఇరవైరూపాయలు పాపాయి పాలకి సరిపోతాయి. ఆ రాత్రంతా నిద్రపోకుండా భార్యాభర్తలిద్దరూ తర్జన భర్జనలుపడి ప్రస్తుతానికి కనీసం మరో రెండు వందలు అప్పుచేస్తేకాని గడవదని తేల్చుకున్నారు.

రెండో తారీఖు ఉదయాన్నేరాంబాబు అప్పు ఇచ్చేవాళ్ళని వెతుక్కుంటూ బయల్దేరాడు.

అప్పుడే స్నానం చేసిన మహాలక్ష్మి దేవుడి పటానికి దండం పెడుతూ

''భగవంతుడా! చుట్టాల్నీ, పిలవకుండా వచ్చే చుట్టాల్లాంటి రోగాల్నీ మా ఇంటికి రానీకు'' అని కోరుకుంటోంది.

అంతకాలం తమని ఆదుకున్న ఏకైక బంధువు ముసలి తండ్రి కళ్లల్లో మెదిలాడు ఆమెకి.

కనుకొలుకుల్లో నిలిచిన నీటి చుక్కల్ని గోటితో మీటేసి నవ్వుతూ పిల్లల్ని లేపడానికి వెళ్లింది.

(పిల్లల కాన్వెంటు చదువులు, సినిమాలు లాంటి 'లగ్జరీస్' కలలోకి కూడా రాని రాష్ట్రప్రభుత్వ పాఠశాలల్లోని టెంపరరీ టీచర్స్‌కి ఈ కథ అంకితం. వాళ్ళ జీతం 380 రూ..)

*(ఫిబ్రవరి - 1988 స్వాతి మంత్లీ)*